www.kalamjyothi.com

# కలంజ్యోతి

తెలుగు దినపత్రిక

ఆదివారం
04.10.2026



## SATYAGRAHA

దేశవ్యాప్తంగా వివిధ ప్రజా సమస్యలపై పోరాడుతున్న వారి గళాలను ఏకతాటిపైకి తెచ్చేందుకు కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రతిష్టాత్మకంగా సత్యాగ్రహ వేదికను ప్రారంభించారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. సత్యం, న్యాయం కోసం గళమెత్తుతున్న బాధితులకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని స్పష్టం చేస్తూ, క్షేత్రస్థాయిలో ఉద్యమిస్తున్న ప్రజలంతా తమ ఉద్యమ వివరాలను సంబంధిత వెబ్ సైట్‌లో నమోదు చేసుకుని పోరాటాన్ని జాతీయ స్థాయిలో మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

- కలంజ్యోతి, హైదరాబాద్

- రాహుల్ గాంధీ కొత్త ఉద్యమ వేదిక
- ఒకే మ్యాప్‌పైకి ప్రజా పోరాటాలు
- సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక పిలుపు
- దేశవ్యాప్త ఉద్యమాలను ఏకతాటిపైకి తెచ్చే ప్రయత్నం

7 లో

# మీ గళం వింటాం.. సత్యాగ్రహం తెస్తాం



## కాంగ్రెస్ శకం ముగిసింది

7 లో

- ఎండిన పైర్లను చూసి చలించిన హరీశ్‌రావు
- రోడ్ల మరమ్మతులు చేయలేని దయనీయ స్థితి
- ఫ్యూచర్ సిటీకి భవిష్యత్తు లేదని ఎద్దేవా?
- అధికార పార్టీ నుంచి ప్రతిపక్షంలోకి వలసలు
- కండువలు కప్పి ఆహ్వానించిన మాజీ మంత్రి

రాష్ట్రంలో కాంగ్రెస్ శకం ముగిసిపోయిందని మాజీ మంత్రి హరీశ్‌రావు స్పష్టం చేశారు. మెదక్ జిల్లా నర్సాపూర్‌లో కాంగ్రెస్ నేతలను బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించిన ఆయన, ప్రభుత్వం కనీసం రోడ్ల మరమ్మతులు కూడా చేయించలేని దయనీయ స్థితిలో ఉందని దుయ్యబట్టారు. అనంతరం కాగజ్ మద్దూర్ గ్రామంలో విద్యుత్ కోతలు, లోవోల్టేజీ సమస్యలతో నిలువునా ఎండిపోతున్న వరి పైర్లను ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డితో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించి, నష్టపోయిన రైతులను ఓదార్చారు. పాలకులు కల్పిత ప్రాజెక్టులపై కాకుండా అన్నదాతల సమస్యలపై దృష్టి పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

- కలంజ్యోతి, నర్సాపూర్



## కేబీఆర్ ప్రాజెక్టులో భారీ మార్పులు

- ఎన్ఎఫ్‌సీఎల్ ఫ్లైఓవర్ రద్దుకు నిర్ణయం
- రూ.715 కోట్లతో స్టీల్ బ్రిడ్జి నిర్మాణం
- స్టాండింగ్ కమిటీలో పలు నిర్ణయాలకు ఆమోదం
- ప్యాకేజీలు సవరించి మేఘా సంస్థకు అప్పగింత

**కలంజ్యోతి, హైదరాబాద్ (అక్టోబర్ 04) :** కేబీఆర్ పార్కు పరిసరాల్లో చేపట్టనున్న ప్రాజెక్టు డిజైన్లలో జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ భారీ మార్పులు చేసింది. గతంలో రూ.1,090 కోట్లతో ప్రతిపాదించిన ఏడు అండర్‌పాసులు, ఏడు ఫ్లైఓవర్ల నిర్మాణాన్ని రద్దు చేసి, వాటి స్థానంలో రూ.715.16 కోట్లతో జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు నుంచి ముఫకంజా ఇంజినీరింగ్ కాలేజీ వరకు సరికొత్తగా స్టీల్ బ్రిడ్జి నిర్మించాలని నిర్ణయించింది. అలాగే బంజారాహిల్స్ నుంచి ఎన్ఎఫ్‌సీఎల్ జంక్షన్ వద్ద 2లేన్ ఏకదిశ ఫ్లైఓవర్, టీవీ9 జంక్షన్ వద్ద అండర్‌పాస్, ఫ్లైఓవర్ పనులను రద్దు చేసింది. కేఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్స్‌తో కుదిరిన కాంట్రాక్ట్ అగ్రిమెంట్‌ను రద్దు చేసి వారి డిపాజిట్లను తిరిగి ఇవ్వాలని తీర్మానించింది. స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మొత్తం 11 అంశాలకు ఆమోదముద్ర పడింది.

**రెండు ప్యాకేజీల పరిధి, వ్యయం సవరణ**

ప్రాజెక్టు పరిధిని సవరించి జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు నుంచి ముర్గ జంక్షన్ వరకు రూ.365.85 కోట్లతో ప్యాకేజీ1, ముర్గ జంక్షన్ నుంచి ముఫకంజా కాలేజీ వరకు రూ.349.31 కోట్లతో ప్యాకేజీ2 పనులను మేఘా ఇంజినీరింగ్ సంస్థకు అప్పగించాలని కమిటీ నిర్ణయించింది. దీంతో పాటు ఆరాంఘర్‌జూపార్కు మార్గంలో 6లేన్ గ్రేడ్ సెపరేటర్‌కు రూ.799.74 కోట్లు, ఒవైసీ హాస్పిటల్, బహదూర్‌పురా జంక్షన్ల మల్టీలెవల్ ఫ్లైఓవర్లకు రూ.161 కోట్ల సవరించిన నిధులకు ఆమోదం లభించింది. అబిడ్స్ పార్కింగ్ లీజు పొడిగింపు, కొత్త చంద్రాయణగుట్ట ఠాణా భవన నిర్మాణానికి జీహెచ్ఎంసీ

మిగతా 3లో..

కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
ఆదివారం 04.10.2026
www.kalamjyothi.com




# పేదింటి ఆడబిడ్డలకు కేసీఆర్ భరోసా

- పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- కల్యాణలక్ష్మికి పుష్కర కాలం పూర్తి
- కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం
- రూ.11,130 కోట్ల ఆర్థిక సాయం
- అంబేద్కర్ విగ్రహం వద్ద బీఆర్ఎస్ సంబరాలు



**కలంజ్యోతి, పటాన్‌చెరు (అక్టోబర్ 03) :** పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఆర్థిక భరోసా కల్పించేందుకు కేసీఆర్ ప్రవేశపెట్టిన కల్యాణలక్ష్మి పథకం విజయవంతంగా 12 వసంతాలు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా పటాన్‌చెరు పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి బీఆర్ఎస్ శ్రేణులు ఘనంగా పాలాభిషేకం నిర్వహించాయి. పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి నాయకత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో కో ఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు మాద్రి పృథ్వీరాజ్ పాల్గొని కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఈ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 12.71 లక్షల కుటుంబాలకు రూ.11,130 కోట్ల మేర భారీ ఆర్థిక సహాయం అందిందని కొనియాడారు. ఆడబిడ్డ పెళ్లి అంటే తల్లిదండ్రులు అప్పులపాలు కాకూడదనే ఉన్నతమైన ఆశయంతో కేసీఆర్ ఈ మహోన్నత పథకానికి శ్రీకారం చుట్టారని గుర్తుచేశారు.

**పేదల జీవితాల్లో వెలుగులు నింపిన పథకం**

నాయకుడు మాద్రి పృథ్వీరాజ్ మాట్లాడుతూ, 2014 అక్టోబర్ 2న ప్రారంభమైన కల్యాణలక్ష్మి పథకం నిరుపేద కుటుంబాల్లోని ఆడబిడ్డల పెళ్లిళ్లకు కొండంత అండగా నిలిచిందని పేర్కొన్నారు. వివాహ సమయంలో తల్లిదండ్రులపై పడే ఆర్థిక భారాన్ని తగ్గించాలనే సదుద్దేశంతో ప్రారంభించిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు లక్షలాది కుటుంబాలకు నిజమైన ఆర్థిక రక్షణ కల్పించాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్, మాజీ మార్కెట్ చైర్మన్ విజయ్, సీనియర్ నాయకులు గూడెం మధు, శ్రీధర్ చారి, యాదగిరి యాదవ్, వెంకటేష్, నర్ర బిక్షపతి, ధనరాజ్ గౌడ్, గుండమొల్ల రాజు, పర్మష్ యాదవ్, కాట రాజు గౌడ్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, అభిమానులు, ఎంపీఆర్ యువసేన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# ఏఎంసీ పీఠం స్థానికులకే దక్కాలి

## బొప్పాపూర్ కాంగ్రెస్ శ్రేణుల డిమాండ్

**కలంజ్యోతి ప్రతినిధి, ఎల్లారెడ్డిపేట (అక్టోబర్ 03) :** ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్మన్ పదవిని తమ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడికే కేటాయించాలని రాచర్ల బొప్పాపూర్ గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. ప్రస్తుత పాలక వర్గం పదవీకాలం ముగియడంతో నూతన చైర్మన్ నియామకానికి కసరత్తు జరుగుతోంది. ఈ సందర్భంగా గ్రామ ఉపసర్పంచ్, కాంగ్రెస్ లీగల్ సెల్ జిల్లా వైస్ చైర్మన్ కొండాపురం వెంకట్ రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు చల్ల పద్మారెడ్డి, మాజీ సింగిల్ విండో డైరెక్టర్ మొడుసు నారాయణ రెడ్డి, పార్టీ మండల కార్యదర్శి నీరటి భాను మాట్లాడారు. మార్కెట్ కమిటీ ఏర్పడిన నాటి నుంచి పరిధిలోని వివిధ గ్రామాల వారికి చైర్మన్ పదవి దక్కిందే తప్ప, బొప్పాపూర్ గ్రామానికి చెందిన వారికి ఇప్పటివరకు ఒక్కసారి కూడా అవకాశం రాలేదని గుర్తుచేశారు. ప్రస్తుతం ఏఎంసీ చైర్మన్ పదవి జనరల్ కేటగిరీకి రిజర్వ్ అయినందున, ఏళ్ల తరబడి ఎలాంటి పదవులు ఆశించకుండా పార్టీ కోసం నిస్వార్థంగా పనిచేస్తున్న తమ గ్రామ నాయకులకే అవకాశం కల్పించాలని స్పష్టం చేశారు. స్థానికులను విస్మరించి ఇతర గ్రామాల వారికి కట్టబెట్టే ప్రయత్నాలు చేయడం ఏమాత్రం తగదన్నారు.

**ఆకాంక్షలు గౌరవించకుంటే మూకుమ్మడి నిర్ణయం తప్పదు**

తమ గ్రామానికి చెందిన నాయకుడికి చైర్మన్ పీఠం ఇవ్వాలని కోరుతూ స్థానిక శ్రేణులు ముక్త కంఠంతో నినదించాయి. స్థానికుల డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకోకుండా ఇతర ప్రాంతాల వారికి పదవి అప్పగిస్తే గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలంతా మూకుమ్మడిగా రాజీనామాలు చేయాల్సి వస్తుందని పార్టీ అధిష్ఠానాన్ని హెచ్చరించారు. నాయకత్వం స్థానికుల ఆకాంక్షలను గుర్తించి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ కొంగరి కిష్టారెడ్డి, కార్యకర్తలు ఏలూరి శ్రీనివాస్, అరికల రామచంద్రం, ఇల్లేందుల రాజిరెడ్డి, పని దేవరాజు, మొడుసు పద్మారెడ్డి, మరుపాక బాల పోషయ్య, బుర్రవేణి ఎల్లయ్య, కొండాపురం మల్లారెడ్డి పాల్గొన్నారు.

# అర్హులెవరూ ఓటు కోల్పోవద్దు

- రాష్ట్ర పరిశీలకులు టి.కె. శ్రీదేవి ఆదేశం
- పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసిన అధికారులు



**కలంజ్యోతి, నిర్మల్ (అక్టోబర్ 03) :** ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యంత కీలకమైన ఓటు హక్కును అర్హులైన ఏ ఒక్కరూ కోల్పోకుండా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను అత్యంత పకడ్బందీగా పూర్తి చేయాలని రాష్ట్ర పరిశీలకులు టి.కె. శ్రీదేవి అధికారులను ఆదేశించారు. నిర్మల్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రాతో కలిసి ఆమె ఎస్ఐఆర్ ప్రక్రియపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మెరుగైన సమాజ నిర్మాణానికి ఓటు హక్కు పునాది వంటిదని పేర్కొన్నారు. ఓటు హక్కు దుర్వినియోగాన్ని అరికట్టడంతో పాటు అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు దక్కేలా చూడటం అధికారుల ప్రధాన బాధ్యత అని స్పష్టం చేశారు. జిల్లాలో ఈ ప్రక్రియ సాగుతున్న తీరుపై ఆమె సంతృప్తి వ్యక్తం చేస్తూ, సమర్థవంతంగా పనిచేస్తున్న కలెక్టర్, యంత్రాంగాన్ని, సహకరిస్తున్న రాజకీయ పార్టీల ప్రతినిధులను అభినందించారు. మిగిలి ఉన్న ధ్రువపత్రాల పరిశీలనను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని, బీఎల్ఓలు తప్పనిసరిగా ఓటర్ల ఇళ్లకు స్వయంగా వెళ్లి క్షేత్రస్థాయి పరిశీలన జరపాలని స్పష్టం చేశారు. ఓట్ల తొలగింపునకు గల కారణాలను రికార్డుల్లో పక్కాగా నమోదు చేయాలని, ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి యువతీ యువకుడిని ఓటరుగా నమోదు చేసేందుకు ఫారం6పై స్వీప్ ద్వారా విస్తృత ప్రచారం కల్పించాలని సూచించారు.

**క్షేత్రస్థాయిలో కొనసాగుతున్న పరిశీలనలు**

సమీక్ష అనంతరం రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు టి.కె. శ్రీదేవి, కలెక్టర్ భవేశ్ మిశ్రాతో కలిసి నిర్మల్ పట్టణంలోని కస్బా, నిర్మల్ గ్రామీణ మండలంలోని న్యూ పోచంపాడ్ గ్రామంలోని పోలింగ్ కేంద్రాలను స్వయంగా సందర్శించారు. అక్కడ కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను క్షుణ్ణంగా తనిఖీ చేసి, ఓటర్ల నుంచి సేకరించిన ధ్రువపత్రాల పరిశీలన, ఫారాల పరిష్కారంపై స్థానిక బీఎల్ఓలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో పనులు జరుగుతున్న తీరుపై పరిశీలకులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ రాథోడ్ రమేష్, భైంసా, ఉట్నూర్ సబ్ కలెక్టర్లు అజ్మీరా సంకేత్ కుమార్, ప్రణయ్ కుమార్, ఆర్డీవో దేవీదాస్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కరెంటు ఉచ్చులపై పీడీ యాక్ట్

## సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకటేష్

**కలంజ్యోతి ప్రతినిధి, ఎల్లారెడ్డిపేట (అక్టోబర్ 03) :** అడవి జంతువుల వేటకు, పంటల రక్షణకు విద్యుత్ తీగలు అమర్చి అమాయకుల ప్రాణాలతో చెలగాటమాడితే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని ఎల్లారెడ్డిపేట సీఐ ఓ వెంకటేష్ స్పష్టం చేశారు. గంభీరావుపేట పోలీస్ స్టేషన్ ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అడవి జంతువుల బారి నుండి పంట పొలాలను కాపాడుకునేందుకు రైతులు, వేటగాళ్లు కరెంటు షాకులు, ఉచ్చులు పెట్టి ప్రజల ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టి కేసుల పాలు కావద్దని హితవు పలికారు. ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. ఇటీవల గంభీరావుపేట మండల కేంద్రంలో గురువారం పంట పొలాన్ని రక్షించుకునే క్రమంలో విద్యుత్ షాక్‌కు గురై గంట దేవయ్య, గంట లక్ష్మి అనే దంపతులు మృతి చెందిన ఘటనను ఆయన గుర్తు చేశారు. గతంలోనూ కోనరావుపేట, రుద్రంగి మండలాల్లో ఇలాంటి విషాద సంఘటనలు చోటుచేసుకున్నాయని తెలిపారు. పంట పొలాల చుట్టూ, అడవుల్లో కరెంటు తీగలు పెట్టి ప్రమాదాలకు కారణమైతే వాటిని మర్డర్ కేసులతో సమానంగా పరిగణించి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో స్థానిక ఎస్సై పాల్గొన్నారు.



# కలంజ్యోతి

తెలుగు దినపత్రిక

3

ఆదివారం 04.10.2026

www.kalamjyothi.com






# అమ్రాబాద్‌లో పులుల సందడి

- మూడు నెలల తర్వాత సఫారీ షురూ
- తొలిరోజే పర్యాటకులకు కనువిందు
- సఫారీ పర్యటనలు ప్రారంభం కాగానే పెద్దపులుల దర్శనం



**కలంజ్యోతి, నాగర్‌కర్నూల్, అమ్రాబాద్ (అక్టోబర్ 03) :** అటవీ ప్రాంతంలో ప్రకృతి ప్రేమికులకు అరుదైన అనుభూతి లభించింది. దాదాపు 3 నెలల విరామం అనంతరం అటవీశాఖ అనుమతితో సఫారీ పర్యటనలు తిరిగి ప్రారంభమయ్యాయి. తొలిరోజే రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో పర్యాటకులు అమ్రాబాద్ కు తరలివచ్చారు. అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ లో పర్యాటకులకు మళ్లీ పులుల దర్శనం కనువిందు చేసింది. ఉదయం సఫారీ వాహనాల్లో అటవీ ప్రాంతంలో పర్యటిస్తున్న సమయంలో పర్యాటకులకు మూడు పెద్ద పులులు కనిపించాయి. రోడ్డు సమీపంలో సంచరిస్తూ కనిపించిన పులులను చూసి ఉత్సాహానికి లోనయ్యారు. సెల్‌ఫోన్లలో పులుల దృశ్యాలను చిత్రీకరించారు.

**పర్యాటకుల్లో వెల్లివిరిసిన ఆనందోత్సాహాలు**

3 పులులు వేర్వేరు ప్రాంతాల్లో కనిపించడంతో సఫారీకి వచ్చిన పర్యాటకుల్లో ఆనందం వెల్లివిరిసింది. దీంతో అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లో సఫారీ పర్యటనలు తొలిరోజే సందడిగా మారాయి. పులుల ప్రత్యక్ష దర్శనంతో అమ్రాబాద్ సఫారీకి మరింత ఆకర్షణ పెరిగిందని, ఇలాంటి అరుదైన దృశ్యాలు చూడటం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని పర్యాటకులు హర్షం వ్యక్తం చేశారు.

# కల్యాణలక్ష్మి ఫైల్స్ మాయం

- ఆర్డీవో కార్యాలయంలో అధికారుల అలసత్వం
- ఏళ్ల తరబడి ఎదురుచూపుల్లో లబ్ధిదారులు
- మళ్లీ కొత్తగా దరఖాస్తు చేసుకోవాలని సూచన



**కలంజ్యోతి, నాగర్ కర్నూలు (అక్టోబర్ 03) :** ప్రభుత్వ కార్యాలయాల్లో పేదల దరఖాస్తులకు దిక్కూదివాణం లేకుండా పోతోంది. నాగర్‌కర్నూల్ ఆర్డీవో కార్యాలయంలో అధికారుల నిర్లక్ష్యం మరోసారి స్పష్టంగా బయటపడింది. నిరుపేద ఆడబిడ్డల పెళ్లిళ్లకు ప్రభుత్వం అందించే కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల దరఖాస్తుల ఫైల్స్ కార్యాలయం నుంచి కనిపించకుండా పోయినట్లు బాధితులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. మండల తహసీల్దార్ కార్యాలయాల నుంచి ఆర్డీవో కార్యాలయానికి చేరిన దరఖాస్తులను సిబ్బంది స్వీకరించినప్పటికీ, వాటిని ముందుకు కదపకుండా, ప్రాసెస్ చేయకుండా దీర్ఘకాలంగా పెండింగ్‌లో పెట్టారని లబ్ధిదారులు వాపోతున్నారు.

**బాధితులకు సమాధానం చెప్పేదెవరు?**

ఏళ్ల తరబడి కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా సమస్య పరిష్కారం కాకపోవడంతో పేదలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్యాలయంలోని ఫైల్స్ కనిపించడం లేదని సాకులు చెబుతూ, మళ్లీ కొత్తగా ఫైల్స్ తయారు చేసుకుని రావాలని అధికారులు ఉచిత సలహాలు ఇస్తున్నారని బాధితులు మండిపడుతున్నారు. జిల్లా కేంద్రంలోని సంజయ్‌నగర్ కాలనీకి చెందిన గౌస్ పాషా తన సోదరి వివాహం జరిగి రెండేళ్లు గడుస్తున్నా షాదీ ముబారక్ దరఖాస్తు ముందుకు సాగడం లేదని వాపోయారు. పేదల కోసం ఉద్దేశించిన సంక్షేమ పథకం దస్తావేజులే గల్లంతైతే బాధ్యత ఎవరిదని, ఈ నిర్లక్ష్యానికి అధికారులు ఏం సమాధానం చెబుతారని ప్రజలు నిలదీస్తున్నారు.

# సొంతింటి ఆశలపై నీలినీడలు

- అసంపూర్తి ఇళ్ల కేటాయింపుపై దుమారం
- అర్హుల జాబితా బహిర్గతం చేయాలని డిమాండ్
- 192 గృహాల చుట్టూ రాజకీయ విమర్శలు



**కలంజ్యోతి, నాగర్‌కర్నూల్ (అక్టోబర్ 03) :** పేద ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే గృహ కేటాయింపుల వ్యవహారం ఇప్పుడు తీవ్ర చర్చకు దారితీస్తోంది. జిల్లా కేంద్రంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ ప్రక్రియపై స్థానికంగా పలు సందేహాలు, తీవ్ర ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. కనీస మౌలిక వసతులు కల్పించకుండా, నివాసానికి పూర్తిగా సిద్ధం కాకముందే హడావుడిగా ఇళ్లను ఎలా కేటాయిస్తారంటూ ప్రజల నుంచి ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. లబ్ధిదారుల ఎంపిక విధానంలో పారదర్శకత లోపించిందని, అర్హులైన నిజమైన నిరుపేదల జాబితాను తక్షణమే బహిర్గతం చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. గతంలో నిర్మాణం పూర్తి కాక నిలిచిపోయిన పనులను వేగవంతం చేసి లబ్ధిదారులకు అప్పగించాల్సిన బాధ్యత ఉన్నతాధికారులపై ఉందని ప్రజలు గుర్తుచేస్తున్నారు.

**ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సింది ఎవరు?**

మరోవైపు మొత్తం 192 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపు వ్యవహారం చుట్టూ రాజకీయ విమర్శలు, పరస్పర ఆరోపణలు వెల్లువెత్తుతుండటంతో వాతావరణం వేడెక్కింది. ఇళ్లు అనేది కేవలం నాలుగు గోడల నిర్మాణం మాత్రమే కాదని, ఒక పేద కుటుంబానికి అది జీవన భరోసా, బంగారు భవిష్యత్తు అని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాంటి ఆశల సౌధాల కేటాయింపులోనే అనుమానాలు తలెత్తితే సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఎవరిదన్న ప్రశ్నలు గట్టిగా వినిపిస్తున్నాయి. అసలైన అర్హులెవరు, అనర్హులెవరు అనే విషయాన్ని తేల్చడంతో పాటు, ఇళ్లు నిజంగా నివాసానికి యోగ్యంగా ఉన్నాయా లేదా అనే అంశంపై సంబంధిత అధికారులు నిగ్గుతేల్చి ప్రజలకు స్పష్టత ఇవ్వాల్సి ఉంది.



# పట్టభద్రుల ఎమ్మెల్సీపై బీఆర్ఎస్ సమరశంఖం

- కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను నిలదీయాలి
- అర్హులంతా ఓటర్లుగా నమోదు కావాలి
- సన్నాహక సమావేశంలో నేతల పిలుపు
- ఫామ్-18తో ప్రతి గ్రామంలో ఓటరు నమోదు

**కలంజ్యోతి, చెన్నారావుపేట (అక్టోబర్ 03) :** వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో చెన్నారావుపేట మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు బాల్నే వెంకన్న మాట్లాడుతూ, రానున్న ఎన్నికల్లో విద్యావంతులు తమ ఓటుతో కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. పాలనలో అన్ని వర్గాలను రేవంత్ రెడ్డి ప్రభుత్వం దగా చేసిందని ఆరోపించారు. పార్టీ అభ్యర్థి గెలుపు కోసం ప్రతి ఒక్కరూ సమన్వయంతో కృషి చేయాలని, ఫామ్ 18 ద్వారా అర్హులైన పట్టభద్రులందరూ ఓటరు జాబితాలో పేర్లను నమోదు చేసుకునేలా గ్రామగ్రామాన విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. యువతకు ఉద్యోగాల పేరిట గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ హామీల అమలుపై వెంటనే స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

**నిరుద్యోగ భృతి, జాబ్ క్యాలెండర్‌పై నిలదీత**

ఎన్నికల వేళ ఏడాదికి జాబ్ క్యాలెండర్, మొదటి ఏడాదే 2 లక్షల ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగులకు నెలకు రూ.4,000 భృతి ఇస్తామని ప్రకటించి మాట తప్పారని బాల్నే వెంకన్న మండిపడ్డారు. ఆరు గ్యారెంటీలు, 420 హామీలతో ప్రజలను వంచించిన ప్రభుత్వానికి మేధావులు, పట్టభద్రులే గట్టి గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ బానోత్ పత్తి నాయక్, మండల ఎన్నికల కన్వీనర్ జక్క అశోక్ యాదవ్, మాజీ సొసైటీ చైర్మన్ మురహరి రవి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్లు అనుముల కుమారస్వామి, కొండవీటి ప్రదీప్ కుమార్, మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎండి రఫీ, మండల ఉపాధ్యక్షుడు కుసుమ నరేందర్, యూత్ ప్రెసిడెంట్ మంచోజ్ మనోజ్ కుమార్, మాజీ సర్పంచులు కుండె మల్లయ్య, బోడ సమూ నాయక్, గుగులోతు లాలు, గుగులోతు స్వామి నాయక్, జున్నుతుల శ్రీధర్ రెడ్డి, నాయకులు ములుక సాంబయ్య కవి, గుగులోతు కృష్ణ, మూడు రమేష్, సోషల్ మీడియా ఇన్‌ఛార్జి బోడ మురళి నాయక్, పిండి భిక్షపతి, గ్రామ పార్టీ అధ్యక్షులు కందగట్ల సాంబయ్య, నర్మెట్ట సాంబయ్య, బోడ రవి నాయక్, కందికొండ విజయ్, బోడ సంపత్, మంద చిన్ను, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కేటీఆర్ ప్రాజెక్టులో భారీ మార్పులు

▶▶ మొదటిపేజీ తరువాయి

స్థలం కేటాయింపునకు సైతం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

**ఎంఎంసీ పరిధిలో అభివృద్ధి పనులకు గ్రీన్ సిగ్నల్**

తార్నాకలోని ఎంఎంసీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో చెరువుల పునరుద్ధరణ, రోడ్లు, డ్రైనేజీ పనులకు సంబంధించి మరో 17 ప్రతిపాదనలకు ఆమోదం దక్కింది. చింతల్ చెరువు అభివృద్ధికి రూ.20 కోట్లు, రాంపల్లి చెరువుకు రూ.40 కోట్లు, పటేల్‌నగర్ ఎస్టీపీ నుంచి డీమార్ట్ వరకు రహదారి అభివృద్ధికి రూ.97.50 కోట్లు మంజూరు చేశారు. సైనిక్‌పురి డాగ్ పార్కు, నాగారంలో వివిధ ప్లాంట్ల కాంపౌండ్ వాల్, యూజీడీ పనులకు నిధులు కేటాయించారు. ఈ సమావేశంలో కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డితో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
4
ఆదివారం 04.10.2026
www.kalamjyothi.com



# ప్రభుత్వ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలి

## కలెక్టర్ గరిమ అగ్రవాల్

- జ్యోతిబాపూలే విద్యాలయంలో కలెక్టర్ తనిఖీ
- నాణ్యమైన భోజనం, వసతులపై ఆరా

**కలంజ్యోతి, రాజన్న సిరిసిల్ల, ఎల్లారెడ్డిపేట (అక్టోబర్ 03) :** ప్రభుత్వం కల్పిస్తున్న విద్యా, వసతి సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆకాంక్షించారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని పెద్దూర్ వద్ద ఉన్న మహాత్మా జ్యోతిబాపూలే విద్యాలయాన్ని శనివారం సాయంత్రం జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యాలయంలోని స్టోర్ రూమ్‌లో



నిల్వ ఉంచిన బియ్యం, కూరగాయలు, పండ్లు, నెయ్యి నాణ్యతతో పాటు వాటి గడువు తేదీలను స్వయంగా పరిశీలించారు. మెనూ చార్ట్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేసి, విద్యార్థులకు ఏయే ఆహార



పదార్థాలు సిద్ధం చేస్తున్నారో తెలుసుకున్నారు. రోజువారీ మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందుతోందా, నెలలో నాలుగు సార్లు చికెన్, రెండు సార్లు మటన్, రోజూ గుడ్డు అందిస్తున్నారా లేదా అని సిబ్బందిని, విద్యార్థులను అడిగి ఆరా తీశారు. అనంతరం తాగునీటి ఆర్వో ప్లాంట్‌ను సైతం పరిశీలించారు.

**లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలి..**

విద్యార్థులు ఒక స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని క్రమశిక్షణతో ముందుకు సాగాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు. రెసిడెన్షియల్ విద్యాలయాల్లో ప్రవేశాలకు తీవ్రమైన పోటీ ఉంటుందని, అలాంటి చోట వచ్చిన అవకాశాన్ని ఏమాత్రం చేజార్చుకోకూడదని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ అమలును పర్యవేక్షించేందుకు ప్రతి రెసిడెన్షియల్ పాఠశాలకు మండల స్థాయి అధికారులను ప్రత్యేకంగా నియమించామని, వారు క్రమం తప్పకుండా తనిఖీలు చేసి విద్యార్థులతో కలిసే భోజనం చేస్తారని వివరించారు. తరగతి గదులు, వసతి గృహాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని తెలిపారు. చదువుతో పాటు రోజూ ఆటలు ఆడాలని, సంగీతం, నృత్యం వంటి విభాగాల్లో ప్రావీణ్యం సంపాదించాలని పేర్కొన్నారు. బాగా చదువుకుని సమాజానికి ఆదర్శంగా నిలవాలని, భవిష్యత్తులో ఉన్నత ఉద్యోగాలు, వృత్తుల్లో స్థిరపడాలని విద్యార్థులను ఆశీర్వదించారు.

# విద్యార్థుల భవిష్యత్తుకు దిశానిర్దేశం

- నైపుణ్యాల ఆధారంగా కోర్సులు ఎంచుకోవాలి
- ప్రొఫెసర్ శ్యామ్ సుందర్

**కలంజ్యోతి, చెన్నారావుపేట (అక్టోబర్ 03) :** మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు తమ విద్యా, కెరీర్ రంగాలను ఎంచుకోవాలని ప్రముఖ విద్యావేత్తలు సూచించారు. చెన్నారావుపేట మండలం అమీనాబాద్‌లోని పీఎం శ్రీ తెలంగాణ మోడల్ స్కూల్‌లో 10వ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రత్యేక కెరీర్ గైడెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఇంటర్నేషనల్ సింబయాసిస్ యూనివర్సిటీ ప్రొఫెసర్, డైరెక్టర్ చిట్ట శ్యామ్ సుందర్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు మార్గదర్శనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు ఇతరులను గుడ్డిగా అనుసరించకుండా తమ సొంత ఆసక్తులు, బలాలు, సామర్థ్యాలను గుర్తించి వాటికి అనుగుణంగానే సబ్జెక్టులు, ఉన్నత విద్యా



కోర్సులను ఎంచుకోవాలని స్పష్టం చేశారు. భవిష్యత్ లక్ష్యాలను నిర్దేశించుకునే క్రమంలో తమలో దాగి ఉన్న ప్రత్యేక ప్రతిభను వెలికితీయడం ఎంతో కీలకమని వివరించారు.

**పోటీ ప్రపంచంలో**

**బహుళ నైపుణ్యాలు అత్యవసరం**

ప్రస్తుత పోటీ ప్రపంచంలో కేవలం ఒకే కోర్సుకే పరిమితం కాకుండా ఎన్ఈపీ2020కు అనుగుణంగా బహుళ విద్యా అవకాశాలను అందిపుచ్చుకోవాలని శ్యామ్ సుందర్ పిలుపునిచ్చారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాల ద్వారా అదనపు కోర్సులు నేర్చుకుంటూనే సాంకేతిక పరిజ్ఞానం, కమ్యూనికేషన్ స్కిల్స్, సమస్య పరిష్కార నైపుణ్యాలను నిరంతరం పెంపొందించుకోవాలన్నారు. పదో తరగతి అనంతరం ఇంటర్‌లో సరైన గ్రూపు ఎంపిక, ఆపై ఉన్నత విద్యలో ప్రొఫెషనల్ కోర్సుల ప్రాధాన్యతను విద్యార్థులకు కూలంకషంగా వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ చిట్ట జ్యోతి, ఉపాధ్యాయులు, 10వ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సదస్సు విద్యార్థుల్లో కెరీర్ ఎంపికపై పూర్తి స్పష్టతను నింపింది.



# మంత్రుల పర్యటనను విజయవంతం చేయండి

- పూర్తి నివేదికలతో సిద్ధంగా ఉండాలి
- నిర్మల్ కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశం

**కలంజ్యోతి, నిర్మల్ (అక్టోబర్ 03) :** రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ఇతర ఉన్నతాధికారుల నిర్మల్ జిల్లా పర్యటనను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం నాటి మంత్రుల పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో ఆయన సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆయా శాఖల అధికారులు పూర్తి సమాచారంతో కూడిన సమగ్ర నివేదికలతో సమావేశాలకు సిద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు. మంత్రుల పర్యటనకు సంబంధించి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సూచిస్తూ అధికారులకు వివిధ బాధ్యతలను అప్పగించారు. పర్యటన సందర్భంగా ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా పక్కాగా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని, ప్రోటోకాల్‌ను ఖచ్చితంగా పాటించాలని ఆదేశించారు. అధికారులంతా సమయపాలన పాటిస్తూ నిర్దేశిత సమయానికి సమావేశాలకు హాజరు కావాలని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాథోడ్ రమేష్, ఏఎస్పీ సాయికిరణ్, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రూ.2.70 కోట్లతో విద్యుత్ సబ్‌స్టేషన్

- పదిర, బండలింగంపల్లికి అర్బన్ ఫీడర్
- ప్రజాప్రతినిధులు, అధికారులకు కృతజ్ఞతలు
- తీరనున్న ఏళ్లనాటి విద్యుత్ సమస్యలు
- రైతులు, గ్రామస్తుల్లో వెల్లివిరిసిన హర్షం



**కలంజ్యోతి ప్రతినిధి, ఎల్లారెడ్డిపేట (అక్టోబర్ 03) :** గ్రామీణ ప్రాంతాల్లో నిరంతర, నాణ్యమైన విద్యుత్ సరఫరా లక్ష్యంగా ప్రభుత్వం కీలక నిధులను మంజూరు చేసింది. ఎల్లారెడ్డిపేట మండలంలోని పదిర, బండలింగంపల్లి గ్రామాల్లో రూ.2 కోట్ల 70 లక్షల భారీ వ్యయంతో విద్యుత్ సబ్‌స్టేషన్, అర్బన్ ఫీడర్ మంజూరయ్యాయి. ఈ సబ్‌స్టేషన్ మంజూరుకు విశేష కృషి చేసిన కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్, సిరిసిల్ల శాసనసభ్యులు కేటీ రామారావు, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎన్పీడీసీఎల్ ఎస్ఈ, డీఈ, ఏఈలకు స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కృతజ్ఞతలు తెలిపిన వారిలో బండలింగంపల్లి గ్రామ సర్పంచ్ బాలరాజు నర్సాగౌడ్, ఉపసర్పంచ్ రాజు, పదిర గ్రామ సర్పంచ్ బోనాల మణెమ్మ, బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు కంచర్ల పరశురాములు, ముద్దుల బుగ్గారెడ్డి, సత్యం రెడ్డి, బోనాల సాయి, స్థానిక రైతులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో ఉన్నారు.



కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
5
ఆదివారం 04.10.2026
www.kalamjyothi.com



## రామానుజ జీయర్ స్వామికి పాదపూజ

- భక్తిశ్రద్ధలతో దివ్య ఆశీర్వచనం
- ఆమెడ శ్రీధర్ నివాసంలో పూజా కార్యక్రమం
- భక్తులకు అనుగ్రహ భాషణం చేసిన జీయర్

**కలంజ్యోతి, నిర్మల్ (అక్టోబర్ 03) :** నిర్మల్ ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు ఆమెడ శ్రీధర్ నివాసంలో పరమహంస పరివ్రాజకాచార్యులు శతగోప ముని రామానుజ జీయర్ స్వామివారికి భక్తిశ్రద్ధలతో పాదపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు దివ్య ఆగమన తీర్థ గోష్ఠి, అనుగ్రహ భాషణం, ఆశీర్వచనం అందించారు. సమస్త భక్తజనులు, ఆస్తిక మహాశయులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి జీయర్ స్వామివారి దివ్య మంగళ స్వరూపాన్ని దర్శించుకుని వారి దివ్య ఆశీస్సులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో పురోహితులు రామకృష్ణ కన్నన్, జిల్లా సివిల్ సప్లై మేనేజర్ సుధాకర్, బీజేపీ రాష్ట్ర నాయకుడు అయ్యన్నగారి భూమయ్య, కౌన్సిలర్ సాదం స్వప్న అరవింద్, నర్సారెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



## సైబర్ నేరాలపై అవగాహన

- అమీనాబాద్ మోడల్ స్కూల్‌లో ప్రత్యేక సదస్సు
- గోల్డెన్ అవర్‌లో 1930కు ఫిర్యాదు చేయాలి
- అప్రమత్తతతోనే ఆన్‌లైన్ మోసాలకు అడ్డుకట్ట

**కలంజ్యోతి, చెన్నారావుపేట (అక్టోబర్ 03) :** సాంకేతిక యుగంలో పెరుగుతున్న ఆన్‌లైన్ మోసాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని బేగంబజార్ హెచ్‌ఫాస్ట్ కానిస్టేబుల్ అర్పిత సూచించారు. మండలంలోని అమీనాబాద్ పీఎం శ్రీ తెలంగాణ మోడల్ స్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు సైబర్ సెక్యూరిటీపై అవగాహన సదస్సు నిర్వహించారు. మోడల్ స్కూల్‌లోనే చదువుకుని కానిస్టేబుల్ ఉద్యోగం సాధించిన అర్పిత, తన విధి నిర్వహణలో ఎదురైన వాస్తవ అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. సోషల్ మీడియా ద్వారా ప్రజలు ఆర్థికంగా మోసపోతున్న తీరును వివరించారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే పీడీఎఫ్ ఫైల్స్ ఓపెన్ చేయవద్దని, అనుమానాస్పద ఫోన్ కాల్స్ మాట్లాడవద్దని, వ్యక్తిగత వివరాలు ఎవరికీ పంపవద్దని హెచ్చరించారు. ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగులకు దూరంగా ఉండాలని, గుర్తు తెలియని వ్యక్తులకు ఫోన్ పే ద్వారా నగదు బదిలీ చేయకూడదని స్పష్టం చేశారు. బ్యాంకులు, పోలీసులు ఎన్నడూ ఓటీపీ వివరాలు అడగరని, ఎవరికీ వాటిని చెప్పకూడదని తెలిపారు. సైబర్ మోసం జరిగిన గంటలోపు (గోల్డెన్ పీరియడ్) వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌లో లేదా 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫిర్యాదు చేస్తే నష్టాన్ని నివారించవచ్చని మార్గదర్శనం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చిట్ట జ్యోతి, ఉపాధ్యాయ బృందం, పదో తరగతి విద్యార్థులు పాల్గొన్నారు.



# ఎగువ మానేరు నీటిని విడుదల చేయాలి

- వరి పంటలు ఎండిపోయే ప్రమాదం
- నీరివ్వకుంటే తూములు బద్దలు కొడతాం
- గంభీరావుపేట బీజేపీ నేతల హెచ్చరిక
- రైతులతో కలిసి ప్రధాన రహదారిపై రాస్తారోకో



**కలంజ్యోతి ప్రతినిధి, ఎల్లారెడ్డిపేట (అక్టోబర్ 03) :** సాగునీరందక ఎండిపోతున్న పంట పొలాలను కాపాడేందుకు ఎగువ మానేరు జలాశయం నుంచి తక్షణమే నీటిని విడుదల చేయాలని భారతీయ జనతా పార్టీ గంభీరావుపేట మండల అధ్యక్షుడు కోడె రమేశ్ డిమాండ్ చేశారు. ఎగువ మానేరు పరివాహక ప్రాంతంలో రైతులు సాగు చేసిన వరి పంటలు ప్రస్తుతం నిండు పొట్ట దశకు చేరుకున్నాయని, ఈ కీలక సమయంలో సమృద్ధిగా నీరు అత్యంత ఆవశ్యకమని ఆయన పేర్కొన్నారు. సరైన సమయానికి నీరు అందకపోతే పంటలు నిలువునా ఎండిపోయి అన్నదాతలు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతాంగాన్ని ఆదుకోవాలన్న డిమాండ్‌తో శనివారం గంభీరావుపేట మండల కేంద్రంలో సిద్దిపేటకామారెడ్డి ప్రధాన రహదారిపై రైతులతో కలిసి పెద్ద ఎత్తున బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. ఈ నిరసనతో అధికారులు వెంటనే స్పందించి, సాయంత్రంలోగా సాగునీటి విడుదలపై సానుకూల నిర్ణయాన్ని ప్రకటిస్తామని హామీ ఇవ్వడంతో నాయకులు ఆందోళనను తాత్కాలికంగా విరమించారు.

**రేపటిలోగా నీరివ్వకుంటే ఆందోళనలు ఉధృతం**

ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్యం వీడి రేపటిలోగా నీటిని విడుదల చేయని పక్షంలో బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో స్వయంగా ప్రాజెక్టు తూములను బద్దలు కొట్టి అయినా ఆయకట్టుకు నీటిని పారిస్తామని కోడె రమేశ్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రైతుల శ్రేయస్సు విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మల్లేష్ యాదవ్, సర్పంచ్ పొన్నాల మహేష్, ఉపాధ్యక్షులు యలేందర్, దుర్గేష్ యాదవ్, దేవేందర్ యాదవ్, సర్వోత్తమ్, దేవేందర్ గౌడ్, తిరుపతి, రవీందర్ నాయక్, ఎల్లం, రాజు, శ్రీనివాస్ గౌడ్, అనిల్, మల్లేష్ గౌడ్, రాజేష్, రవీందర్, రైతులు బత్తిని బాలయ్య, తొట్ల చిన్న మల్లయ్య, పెద్ద మల్లయ్య, నర్సింలు, సత్యం, శ్రీనివాస్, రాజనర్సు, దేవా గౌడ్, స్వామి, స్వామి, రాజశేఖర్, లింగం పాల్గొన్నారు.

# లో-వోల్టేజ్ సమస్యకు శాశ్వత పరిష్కారం

- వెల్జీపురం సబ్‌స్టేషన్‌కు రూ.3.76 కోట్లు మంజూరు
- ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ చొరవ
- నాలుగు గ్రామాల రైతుల్లో వెల్లివిరిసిన హర్షం
- హైదరాబాద్‌లో మంజూరు పత్రం అందజేత



**కలంజ్యోతి, ఇల్లంతకుంట (అక్టోబర్ 03) :** ఇల్లంతకుంట మండలంలోని పలు గ్రామాల్లో గత రెండు దశాబ్దాలుగా నెలకొన్న లోవోల్టేజ్ సమస్యకు ఎట్టకేలకు మోక్షం లభించింది. వెల్జీపురం, ఓబులాపురం, చిక్కుడువానిపల్లె, రామోజీపేట గ్రామాల పరిధిలోని రైతులు ఎదుర్కొంటున్న తీవ్ర విద్యుత్ ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం రూ.3.76 కోట్ల అంచనా వ్యయంతో నూతన విద్యుత్ సబ్‌స్టేషన్‌ను మంజూరు చేసింది. మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ప్రత్యేక చొరవతో పాటు ఎన్పీడీసీఎల్ సీఎండీ, డీఈ అంజయ్య, ఏఈ గుడెల్లి శ్రీనివాస్, ఏఈ నగేష్, లైన్ ఇన్‌స్పెక్టర్ పంగపల్లి రఘుపతి రెడ్డి, విద్యుత్ శాఖ సిబ్బంది కనకయ్య, నరేష్ సహకారంతో ఈ ప్రక్రియ వేగంగా పూర్తయింది. ఈ మేరకు హైదరాబాద్‌లోని సచివాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సబ్‌స్టేషన్ మంజూరు పత్రాన్ని వెల్జీపురం సర్పంచ్ నాయిని నవీన్ కుమార్‌కు స్వయంగా అందజేశారు.

**రైతాంగానికి నాణ్యమైన కరెంట్ సరఫరా**

సబ్‌స్టేషన్ మంజూరు కావడం పట్ల వెల్జీపురం సర్పంచ్ నాయిని నవీన్ కుమార్, పీఏసీఎస్ డైరెక్టర్ గుండా వెంకటేశం, మాజీ ఏఎంసీ డైరెక్టర్ కంకణాల రాంప్రసాద్ రెడ్డి, కాంగ్రెస్ శ్రేణులు, స్థానిక రైతులు, గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. గత 20 ఏళ్లుగా పంట పొలాలకు విద్యుత్ అందక నానా అవస్థలు పడ్డామని, ఈ సబ్‌స్టేషన్ నిర్మాణంతో తమ కష్టాలు పూర్తిగా తీరిపోనున్నాయని రైతులు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ రంగానికి నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందించే దిశగా ఇది కీలక ముందడుగు అని స్పష్టం చేశారు. రైతుల సమస్యను గుర్తించి మంజూరుకు విశేష కృషి చేసిన ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, విద్యుత్ శాఖ అధికారులకు సర్పంచ్ నాయిని నవీన్ కుమార్, గ్రామస్తులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
ఆదివారం 04.10.2026
6
www.kalamjyothi.com

# దసరా సెలవులు ఖరారు

- పాఠశాలలకు 13, కాలేజీలకు 12 రోజులు
- అక్టోబర్ 10 నుంచి సెలవుల ప్రకటన
- 23న బడులు, 22న కళాశాలలు రీఓపెన్
- విద్యాసంస్థలకు వేర్వేరుగా తేదీల వెల్లడి



**కలంజ్యోతి, హైదరాబాద్ (అక్టోబర్ 03) :** రాష్ట్రంలోని పాఠశాలలు, జూనియర్ కళాశాలల విద్యార్థులకు దసరా పండుగ సెలవులను విద్యాశాఖ అధికారికంగా ఖరారు చేసింది. 2026 విద్యా సంవత్సరానికి సంబంధించి సెలవుల వివరాలను శనివారం అధికారులు వెల్లడించారు. ఈసారి బడులకు 13 రోజుల పాటు, ఇంటర్మీడియట్ కళాశాలలకు 12 రోజుల పాటు దసరా సెలవులు రానున్నాయి. ప్రభుత్వం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు అక్టోబర్ 10 నుంచి 22వ తేదీ వరకు సెలవులు వర్తిస్తాయి. అనంతరం అక్టోబర్ 23న పాఠశాలలు తిరిగి పునఃప్రారంభం కానున్నాయి. అలాగే జూనియర్ కళాశాలల విద్యార్థులకు అక్టోబర్ 10 నుంచి 21వ తేదీ వరకు సెలవులు ప్రకటించగా, అక్టోబర్ 22న కళాశాలలు తిరిగి తెరుచుకుని తరగతులు ప్రారంభమవుతాయి.

**పరీక్షల అనంతరం దసరా సెలవులు**

ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల్లో సమ్మెటివ్ అసెస్‌మెంట్ 1 (ఎస్ఏ1) పరీక్షలు కొనసాగుతున్నాయి. ఈ పరీక్షలన్నీ అక్టోబర్ 9వ తేదీతో పూర్తి కానున్నాయి. కాగా, చివరి రోజైన అక్టోబర్ 9న నిర్వహించే 9వ తరగతి ఇంగ్లీష్ పరీక్ష సమయాన్ని అధికారులు మార్పు చేశారు. ఈ పరీక్ష ఉదయం 9:15 గంటల నుంచి మధ్యాహ్నం 12:15 గంటల వరకు జరుగుతుందని విద్యాశాఖ స్పష్టం చేసింది. పరీక్షలు ముగిసిన వెంటనే, మరుసటి రోజైన అక్టోబర్ 10 నుంచే విద్యార్థులకు అధికారికంగా దసరా సెలవులు మొదలుకానున్నాయి.



# సేవా జ్యోతిని జయప్రదం చేయండి

- ఈ నెల 7న నిర్మల్‌లో కలశ యాత్ర
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్ పిలుపు
- మోదీ వర్చువల్ ప్రసంగానికి ప్రత్యేక ఏర్పాట్లు

**కలంజ్యోతి, నిర్మల్ (అక్టోబర్ 03) :** భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజాప్రస్థానాన్ని పురస్కరించుకుని నిర్మల్ జిల్లా కేంద్రంలో ఈ నెల 7న నిర్వహించే సేవా జ్యోతి కలశ యాత్ర కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని పార్టీ పరంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. శనివారం స్థానిక బీజేపీ కార్యాలయంలో సేవా జ్యోతి సన్నాహక సమావేశాన్ని రాష్ట్ర, జిల్లా పదాధికారులతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికసిత్ భారత్ సంకల్ప సభలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అదే రోజు వర్చువల్ విధానంలో జాతిని ఉద్దేశించి ప్రసంగించనున్నారని పేర్కొన్నారు. నిర్మల్‌లో చేపట్టే సేవా జ్యోతి ర్యాలీ ముగిసిన అనంతరం మోదీ వర్చువల్ ప్రసంగాన్ని శ్రేణులు, ప్రజలు వీక్షించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో నిర్మల్ జిల్లా ఇన్‌చార్జి గోపిడి ప్రవంతి రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నగర్ నారాయణరెడ్డి, డాక్టర్ మల్లికార్జున్ రెడ్డి, మెడిసేమ్మె రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శులు యాతాళం చిన్నారెడ్డి, కలిపే విలాస్, జిల్లా ఉపాధ్యక్షులు సత్యం చంద్రకాంత్, నల్ల రమేష్, జిల్లా కార్యదర్శి పుష్పూర్ నర్సారెడ్డి, సీనియర్ నాయకుడు సామా రాజేశ్వర్ రెడ్డి, వివిధ మోర్చాల జిల్లా అధ్యక్షులు పాల్గొన్నారు.

# ఎల్లారెడ్డిపేట కాంగ్రెస్ అధ్యక్షుడిగా శ్రీకాంత్‌రెడ్డి

- ఓటింగ్ ద్వారా నూతన అధ్యక్షుడి ఎన్నిక
- తీవ్ర పోటీ నడుమ ఏకగ్రీవ మొగ్గు

**కలంజ్యోతి ప్రతినిధి, ఎల్లారెడ్డిపేట (అక్టోబర్ 03) :** ఎల్లారెడ్డిపేట పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా వంగ శ్రీకాంత్ రెడ్డి శనివారం ఎన్నికయ్యారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని లయన్స్ క్లబ్‌లో ప్రస్తుత పట్టణ అధ్యక్షుడు చెన్ని బాబు ఆధ్వర్యంలో పట్టణ అధ్యక్షుని ఎన్నికల సమావేశం నిర్వహించారు. అధ్యక్ష పదవికి గుర్రపు రాములు, కోనేటి పోచయ్య, మద్దుల శ్రీపాల్ రెడ్డి, పందిళ్ల శ్రీనివాస్ గౌడ్, వంగ శ్రీకాంత్ రెడ్డి, గంట వెంకటేష్ గౌడ్ తీవ్రంగా పోటీ పడ్డారు. అనంతరం సమావేశానికి హాజరైన



మెజార్టీ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఏకాభిప్రాయంతో పాటు ఓటింగ్ ద్వారా వంగ శ్రీకాంత్ రెడ్డి వైపే మొగ్గు చూపారు. దీంతో ఆయనను నూతన పట్టణ అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు.

**పార్టీ శ్రేణుల సమక్షంలో ఆమోదం..**

ఓటింగ్ ద్వారా ఎన్నికైన వంగ శ్రీకాంత్ రెడ్డి పేరును పట్టణ అధ్యక్షుడిగా అధికారికంగా ప్రకటించాలని పార్టీ శ్రేణులు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సూడిది రాజేందర్‌కు సిఫారసు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ గుండాడి రాంరెడ్డి, ఎస్సీ ఎస్టీ జిల్లా స్థాయి మానిటరింగ్ కమిటీ సభ్యుడు బీపేట రాజకుమార్, ఆత్మ కమిటీ సభ్యుడు ఏర్పుల శ్రీనివాస్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పుల్లయ్యగారి తిరుపతి గౌడ్, కుర్మ మల్లేష్ యాదవ్, వార్డు సభ్యులు అంతేర్యుల గోపాల్, ద్యాగం లక్ష్మీనారాయణ, నాయకులు బండారి బాల్‌రెడ్డి, నంది కిషన్, మెండే శ్రీనివాస్ యాదవ్, సోషల్ మీడియా ప్రతినిధి ఇలియాస్ బాబా తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి విక్రేత అరెస్ట్

- నిందితుడికి న్యాయస్థానం రిమాండ్
- మత్తు పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు
- ఎల్లారెడ్డిపేట సీఐ ఓ.వెంకటేష్ వెల్లడి



**కలంజ్యోతి, ఎల్లారెడ్డిపేట (అక్టోబర్ 03) :** గంజాయి విక్రయాలకు పాల్పడుతున్న వ్యక్తిని పట్టుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఎల్లారెడ్డిపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఓ.వెంకటేష్ తెలిపారు. మండలంలోని రాచర్ల గొల్లపల్లి గ్రామానికి చెందిన శ్రీరామోజి రాజేష్ అనే వ్యక్తి, ముస్తాబాద్ మండలం మద్దికుంట గ్రామానికి చెందిన తన స్నేహితుడు పిట్ల నర్సింలు అలియాస్ జిన్న (29) వద్ద గంజాయి కొనుగోలు చేసి తాను సేవించడమే కాకుండా ఇతరులకు అమ్ముతున్న క్రమంలో గతంలో పట్టుబడ్డాడు. ఆ సమయంలో పరారీలో ఉన్న పిట్ల నర్సింలును విశ్వసనీయ సమాచారం మేరకు శనివారం అతడి నివాసం వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హైదరాబాద్‌లో కార్ డ్రైవర్‌గా పనిచేస్తున్న నర్సింలు జల్సాలకు అలవాటుపడి గుర్తుతెలియని వ్యక్తుల వద్ద గంజాయి కొని తెచ్చి గ్రామంలో విక్రయిస్తున్నట్లు విచారణలో అంగీకరించాడు. నిందితుడి వద్ద ఉన్న మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని, అరెస్ట్ చేసి కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్‌కు పంపినట్లు సీఐ పేర్కొన్నారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలపై నిరంతర నిఘా ఉంటుందని, యువత భవిష్యత్తును నాశనం చేసే ఇలాంటి అసాంఘిక శక్తులపై చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.



# ఆరు గ్యారెంటీలను తక్షణమే అమలు చేయాలి

- తహసీల్దార్‌కు బీజేపీ మహిళా మోర్చా వినతి
- అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలి
- మహిళలకు రూ.2500, రైతు భరోసా ఇవ్వాలని డిమాండ్

**కలంజ్యోతి, ఇల్లంతకుంట (అక్టోబర్ 03) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల వేళ ప్రకటించిన ఆరు గ్యారెంటీలను అర్హులైన ప్రజలందరికీ పూర్తిస్థాయిలో అమలు చేయాలని కోరుతూ ఇల్లంతకుంట మండల రెవెన్యూ అధికారికి బీజేపీ మహిళా మోర్చా మండల అధ్యక్షురాలు మారవేణి దివ్య వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహాలక్ష్మి పథకం కింద ప్రతి మహిళకు నెలకు రూ.2,500, రూ.500లకే గ్యాస్ సిలిండర్ అందించాలని డిమాండ్ చేశారు. రైతు భరోసా కింద ప్రతి రైతుకు ఎకరానికి రూ.7,500, కౌలు రైతులకు రూ.12,000, వ్యవసాయ కూలీలకు ఏటా రూ.12,000 సాయం విడుదల చేయాలన్నారు. అలాగే ఇందిరమ్మ ఇళ్లు, యువ వికాసం, గృహజ్యోతి, చేయూత పథకాల్లో భాగంగా దివ్యాంగులకు రూ.6,016, సాధారణ పెన్షన్లను రూ.4,016 చొప్పున తక్షణమే పంపిణీ చేయాలని కోరారు. అర్హత ఉన్నప్పటికీ పథకాలు అందని నిరుపేదలను గుర్తించి లబ్ధి చేకూర్చేలా అధికారులు చొరవ చూపాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు మ్యాకల మల్లేశం, మహిళా మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యురాళ్లు కొలునూరి ముత్తక్క, అలువల భారతి, మండల నాయకులు జంగిటి అజయ్, భూమల్ల ప్రశాంత్, మారవేణి (రాజు) శ్రీశైలం, రగుడ దేవరాజ్, నరిగే మహేష్, శ్రీనివాస్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
7
ఆదివారం 04.10.2026
www.kalamjyothi.com

# మీ గళం వింటాం.. సత్యాగ్రహం తెస్తాం

**కలంజ్యోతి, హైదరాబాద్ (అక్టోబర్ 03) :** దేశవ్యాప్తంగా వివిధ ప్రజా సమస్యలపై పోరాడుతున్న వారి గొంతుకలను ఏకం చేసే మహోన్నత లక్ష్యంతో కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సత్యాగ్రహ పేరుతో ఒక సరికొత్త ఉద్యమ వేదికకు శ్రీకారం చుట్టారు. ఈ విషయాన్ని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన సోషల్ మీడియా ఖాతా ద్వారా అధికారికంగా వెల్లడించారు. దేశవ్యాప్తంగా సత్యం అణచివేతకు గురవుతోందని, దీనికి వ్యతిరేకంగా అన్ని వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా గళమెత్తుతున్నారని పార్టీ పేర్కొంది. భూమి, మహిళల రక్షణ, దళిత, ఓబీసీల హక్కులు, విద్యా రంగ సమస్యలు, పోటీ పరీక్షల్లో అక్రమాలు వంటి అనేక కీలకాంశాలపై ప్రజలు చేస్తున్న నిరసనలను, ఉద్యమాలను ఒకే మ్యాప్‌పైకి తీసుకువచ్చి సమన్వయం చేసేందుకు ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్లు స్పష్టం చేశారు.

### పోరాటాల నమోదుకు ప్రత్యేక వెబ్‌సైట్ రూపకల్పన

ఈ ఉద్యమ సమన్వయం కోసం కాంగ్రెస్ పార్టీ ప్రత్యేకంగా ఒక నూతన వెబ్‌సైట్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చింది. క్షేత్రస్థాయిలో తమ సమస్యలు, నిరసనలపై పోరాడుతున్న ఉద్యమకారులు తమ వివరాలను ఈ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసి, నిర్దేశిత ఫారం నింపడం ద్వారా తమ గళాన్ని జాతీయ స్థాయిలో బలంగా వినిపించేందుకు అవకాశం కల్పించారు. స్థానికంగా విడివిడిగా జరుగుతున్న ఆందోళనలను ఒకే వేదికపైకి చేర్చి, వాటికి జాతీయ స్థాయి గుర్తింపుతో పాటు విస్తృత ప్రజా మద్దతు కూడగట్టడమే ఈ సాంకేతిక వేదిక ముఖ్య ఉద్దేశమని వెల్లడించారు.

### సత్యం, న్యాయం కోసం పూర్తి మద్దతు

ఈ కార్యక్రమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ప్రజల గళాన్ని తాము వింటామని, ప్రతి పోరాటంతో మమేకమవుతామని ఆయన పేర్కొన్నారు. సత్యం, న్యాయం కోసం నిలబడే ప్రతి ఒక్కరికీ కాంగ్రెస్ పార్టీ పూర్తి మద్దతుగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. బాధిత ప్రజలు, పోరాట యోధులు సత్యాగ్రహ వెబ్‌సైట్‌ను సందర్శించి తమ ఉద్యమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. వివిధ ప్రాంతాల్లోని స్థానిక ఆందోళనలను మరింత బలోపేతం చేయడమే ఈ కార్యక్రమ ప్రధాన కర్తవ్యమని పార్టీ స్పష్టం చేసింది.

# జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

- ఇందిరమ్మ పథకంలో గృహ వసతి కల్పించాలి
- ఎన్సీపీ రాష్ట్ర అధ్యక్షుడు మద్దిశెట్టి సామేలు డిమాండ్
- ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులు విలేకరులే
- తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో జర్నలిస్టుల కుటుంబాలు






**కలంజ్యోతి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా (అక్టోబర్ 03) :** ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభంగా నిలుస్తున్న జర్నలిస్టుల సంక్షేమాన్ని ప్రభుత్వాలు ఏమాత్రం విస్మరించకూడదని ఎన్సీపీ పార్టీ ఎన్డీఏ మహాకూటమి ఎన్సీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మద్దిశెట్టి సామేలు డిమాండ్ చేశారు. జర్నలిస్టులకు ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద పక్కా గృహ వసతి కల్పించడంతో పాటు వెంటనే ఇళ్ల స్థలాలు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ వ్యాప్తంగా వేలాది మంది జర్నలిస్టులు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా పనిచేస్తూ సమాజానికి విశేష సేవలందిస్తున్నారని గుర్తుచేశారు. ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి చేరాలన్నా, ప్రజా సమస్యలు పాలకుల దృష్టికి వెళ్లాలన్నా విలేకరుల పాత్ర కీలకమన్నారు. అలాంటి జర్నలిస్టులు నేడు సొంత గూడు లేక అద్దె ఇళ్లలో ఉంటూ తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటుండడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా, నియోజకవర్గ, డివిజన్, మండల స్థాయిల్లో పనిచేసే చాలా మంది జర్నలిస్టులకు సొంత ద్విచక్ర వాహనం కూడా లేదని, వార్తల సేకరణకు అవసరమైన పెట్రోల్ ఖర్చులకు సైతం ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. కుటుంబ పోషణ, పిల్లల చదువుల భారం మోయలేక దయనీయ స్థితిలో బతుకులీడుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

### అర్హులను గుర్తించి ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి

అర్హులైన జర్నలిస్టులను పారదర్శకంగా గుర్తించి ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూముల్లో ఇళ్ల స్థలాలు కేటాయించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు మద్దిశెట్టి సామేలు విజ్ఞప్తి చేశారు. స్థానిక శాసనసభ్యులు, జిల్లా కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు, జర్నలిస్ట్ యూనియన్లతో సమన్వయం చేసుకుని నిజంగా ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న క్షేత్రస్థాయి విలేకరులను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో స్థలాలు మంజూరు చేయాలని సూచించారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం త్వరలోనే కేంద్ర ప్రభుత్వానికి, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రికి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి సమగ్ర వినతిపత్రం సమర్పించనున్నట్లు ఆయన వెల్లడించారు.



# కాంగ్రెస్ శకం ముగిసింది





**కలంజ్యోతి, నర్సాపూర్ (అక్టోబర్ 03) :** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ శకం ముగిసిపోయిందని మాజీ మంత్రి హరీశ్‌రావు స్పష్టం చేశారు. మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గంలో పలువురు కాంగ్రెస్ నేతలు బీఆర్ఎస్ పార్టీలో చేరగా, వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆయన సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాధారణంగా ప్రతిపక్షం నుంచి అధికార పక్షంలోకి వలసలు ఉంటాయని, కానీ ఎన్నికలకు ఇంకా రెండేళ్ల సమయం ఉండగానే అధికార కాంగ్రెస్ నుంచి నేతలు ప్రతిపక్ష బీఆర్ఎస్‌లోకి రావడం అసాధారణ పరిణామమని వ్యాఖ్యానించారు. మూడేళ్ల కాంగ్రెస్ పాలనలో కనీసం రోడ్ల మరమ్మతులు కూడా చేపట్టలేదని, రహదారులన్నీ గుంతలమయంగా మారి నిత్యం ప్రమాదాలకు కారణమవుతున్నాయని దుయ్యబట్టారు. అభివృద్ధి పనుల వైఫల్యంపై క్షేత్రస్థాయిలో ప్రజలు కాంగ్రెస్ నేతలను నిలదీస్తున్నారని, తీవ్ర ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకున్న పార్టీలో ఉండలేక కేసీఆర్ నాయకత్వమే మేలని భావించి నేతలు బీఆర్ఎస్‌లో చేరుతున్నారన్నారు. ప్రభుత్వం గొప్పగా ప్రచారం చేసుకుంటున్న ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టును ఫ్యూచర్ లేని సిటీగా ఎద్దేవా చేస్తూ, ఉన్న నివాస ప్రాంతాల్లో కనీస సౌకర్యాలు కల్పించకుండా ఇలాంటి ప్రాజెక్టులు చేపట్టడం హాస్యాస్పదమని మండిపడ్డారు.

### పొలాల్లోకి దిగి రైతుల కష్టాలు తెలుసుకున్న నేతలు

నర్సాపూర్ నియోజకవర్గ పర్యటనలో మాజీ మంత్రి హరీశ్‌రావు, స్థానిక ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి క్షేత్రస్థాయిలో రైతుల కష్టాలను స్వయంగా పరిశీలించారు. నియోజకవర్గ పరిధిలోని కాగజ్ మద్దూర్ గ్రామంలో పర్యటిస్తుండగా మార్గమధ్యంలో విద్యుత్ సరఫరా లేక నిలువునా ఎండిపోతున్న వరి పొలాలను చూసి తీవ్రంగా చలించిపోయారు. వెంటనే వాహనం దిగి నేరుగా పొలాల్లోకి వెళ్లి అక్కడ ఉన్న మహిళా రైతు నాగమణితో మాట్లాడి పంట నష్టం వివరాలు, ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. చిట్టోళ్ల నాగమణి అనే ఆ మహిళా రైతు మాజీ మంత్రి ఎదుట తన గోడును వెళ్లబోసుకుంది. బోర్లలో పుష్కలంగా నీళ్లు ఉన్నప్పటికీ ప్రభుత్వ చేతకానితనం వల్లే విద్యుత్ సక్రమంగా అందక పంటలు కళ్లెదుటే ఎండిపోతున్నాయని వాపోయింది. దాదాపు 60 వేల రూపాయల వరకు అప్పులు చేసి పెట్టుబడి పెట్టి మూడు ఎకరాల్లో వరి సాగు చేస్తే, అందులో సగం పొలం ఇప్పటికే పూర్తిగా ఎండిపోయిందని కన్నీటిపర్యంతమైంది. పైరు పొట్టదశకు వచ్చిన అత్యంత కీలక సమయంలో నీరు అందక రైతుల బతుకులు ఆగం అవుతున్నాయని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది.

### విద్యుత్ కోతలు, లో-వోల్టేజీతో మోటార్లు దగ్ధం

గతంలో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో పగటిపూట నిరంతరాయంగా నాణ్యమైన కరెంటు వచ్చేదని, ఎలాంటి రందీ లేకుండా సంతోషంగా పంటలు పండించుకున్నామని నాగమణి గుర్తు చేసుకుంది. ప్రస్తుతం కాంగ్రెస్ పాలనలో కరెంటు ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని దుస్థితి నెలకొందని మండిపడింది. ఉదయం 5 గంటలకు రావాల్సిన విద్యుత్ 8 గంటలకు వస్తోందని, ఆ వచ్చిన అరకొర కరెంటు కూడా నిలకడగా ఉండకుండా మధ్యాహ్నానికే కోతలకు గురవుతోందని వివరించింది. తీవ్రమైన లోవోల్టేజీ సమస్యతో పదే పదే ఫ్యూజులు ఎగిరిపోవడమే కాకుండా మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయని తెలిపింది. నెల రోజుల వ్యవధిలోనే మూడుసార్లు ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోగా, మరమ్మతుల పేరిట నాలుగు రోజుల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పంటలు దెబ్బతిన్నాయని వాపోయింది. కరెంటు వచ్చిపోతుండటంతో పారిన మడే పారుతూ కింది మడులకు చుక్క నీరు అందడం లేదని స్పష్టం చేసింది. ఆ ప్రాంతంలో ఒక్క నాగమ్మ పరిస్థితే కాకుండా రైతులందరిదీ ఇదే దుస్థితి అని తెలుసుకున్న హరీశ్‌రావు తీవ్ర విచారం వ్యక్తం చేశారు.

# తారా సుతారియాకు లక్కీ ఛాన్స్

బాలీవుడ్ కథానాయిక తారా సుతారియా ఖాతాలో భారీ పౌరాణిక చిత్రం చేరింది. స్టార్ హీరో విక్కీ కౌశల్ ప్రధాన పాత్రలో నటిస్తున్న భారీ చిత్రం మహావతార్‌లో ఆమె హీరోయిన్‌గా ఎంపికైనట్లు సమాచారం. విక్కీ సరసన నటించగల సత్తా ఉన్న నటిగా ఆమెను మేకర్స్ ఖరారు చేశారు. స్త్రీ 2 దర్శకుడు అమర్ కౌశిక్, మడాక్ ఫిల్మ్స్ సంస్థలు చిరంజీవి పరశురాముడి జీవితం ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాయి. శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ మూవీని క్రిస్మస్ కానుకగా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు

కలం జ్యోతి
తెలుగు దినపత్రిక

